క్లుప్తంగా

కోసల మాంసం రుచి చూడాల్సిందే!

పట్టుబడుతున్న మాంసాహారులు

అమలాపురం రూరల్: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కోడి పందేల బరుల్లో కోసల మాంసం కోసం మాంసాహారులు ఎగబడుతున్నారు. ఒక్కొక్క కోస రూ.3 వేల నుంచి రూ 5వేల వరకు పలుకుతోంది. పండగ పూట ఇంటికి వచ్చే చుట్టాలకు కోస మాంసంతో భోజనం పెట్టాలని కొనుగోలు దారులు ఆసక్తి కనబరుస్తున్నారు. రాజకీయ నాయకుల పలుకుబడిని ఇందుకు వినియోగించుకోవడం గమనార్హం. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు తమపై అధికారులను ప్రసన్నం చేసుకునేందుకు కోసలను తీసుకుని వెళుతున్నారు. దీంతో వీటికి డిమాండ్ మరింత పెరిగింది.

రూ.10 కోట్ల పైనే పందేలు

ముమ్మిడివరం: నియోజకవర్గంలో పండగ మూడు రోజులు జూదాలు, పందేలలో ఎసుమారు రూ.10 కోట్ల మేర చేతులు మారినట్లు భావిస్తున్నారు. మురమళ్లలో కోడి పందేలు తిరునాళ్లను తలపించే రీతిలో జరిగాయి. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పోటీలను పర్యవేక్షించారు. కాకినాడ ఎంపీ తంగిరాల ఉదయ శ్రీనివాస్‌తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు ఈ పందేలలో పాల్గొన్నారు

పాస్టర్ దావీదు మృతికి సంతాపం

యానాం: నీలపల్లి, యానాం పరిసర ప్రాంతాల్లో క్రీస్తు బోధనలను ప్రచారం చేస్తూ ఆధ్యాత్మిక సేవలు అందించిన పాస్టర్ పంపన దావీదు(84) బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా నీలపల్లిలో చర్చి ఆవరణలో ఉంచిన ఆయన పార్థివ దేహానికి యానాం, తాళ్లరేవు, కాకినాడ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన పాస్టర్లు, అధిక సంఖ్యలో క్రైస్తవులు సంతాపం తెలిపి నివాళులర్పించారు. జన సందోహం మధ్య ఊరేగింపుగా అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యుడు, కాకినాడ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు దొమ్మేటి శామ్యూల్‌సాగర్, పాస్టర్ యేసేబు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌బీచ్‌కు సందర్శకుల తాకిడి



గోదావరిలో బోటు షికారు చేస్తున్న సందర్శకులు

యానాం: సంక్రాంతికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో బుధవారం రాజీవ్ రివర్ బీచ్ సందడిగా మారింది. దీంతో స్థానిక శివమ్‌బాత్ వద్ద పలువురు జల్లు స్నానాలు చేశారు. స్థానిక పుష్కరమాత విగ్రహం నుంచి జీసెస్ స్టాట్యూ వరకు తెలంగాణా, ఏపీ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు వాహనాల్లో తరలి రావడంతో ట్రాఫిక్ పోలీసులు బీచ్‌కు ముందు వాటిని నిలిపివేసే ఏర్పాట్లు చేశారు. సందర్శకులు బోటు షికారుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారంతా టూరిజం బోట్లలో విహరించారు.

అయ్యప్ప మకర జ్యోతి దర్శనం



మహాశాస్త అయ్యప్పస్వామి

అమలాపురం రూరల్: ఈదరపల్లి బైపాస్ రోడ్‌లో వేంచేసి యున్న కోనసీమ మహాశాస్త అయ్యప్ప స్వామి ఆలయంలో మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం మకర జ్యోతి దర్శనాన్ని ఘనంగా నిర్వహించారు. యాళ్ల ధనరాజు దంపతులు గణపతి హోమం, అయ్యప్పకు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. శేష వెండి రథంపై గ్రామోత్సవం నిర్వహించారు. కేరళ వాయిద్యాలతో ఊరేగింపు జరిగింది. సాయంత్రం కోనా గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కొమానపల్లి నటరాజ్‌స్వామి పడిపూజ వైభవంగా జరిగింది. సాయంత్రం స్వామి వారు దివ్యజ్యోతితో దర్శనమిచ్చారు.

'అవర్ ఆర్టిస్ట్స్' పుస్తకం ఆవిష్కరణ

అమలాపురం టౌన్: కోనసీమ చిత్ర కళా పరిషత్ ఈ నెల 19న నిర్వహిస్తున్న చిత్ర కళా బ్రహ్మోత్సవం సందర్భంగా ఆ పరిషత్ అధ్యక్షుడు కొరసాల సీతారామస్వామి 215 మంది చిత్రకారులతో 300 పేజీలతో ముద్రించిన 'అవర్ ఆర్టిస్ట్స్ బోరన్ టు ఎక్సెల్' పుస్తకాన్ని హైదరాబాద్, విశాఖ మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు.

ఐద్వా క్యాలెండర్ ఆవిష్కరణ

అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా శాఖ నూతన సంవత్సరానికి ముద్రించిన క్యాలెండర్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి డాక్టర్ వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. స్థానిక ఎన్‌వీఆర్ నగర్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో గంధం పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

దంపతులను సత్కరించిన విశ్వరూప్

కోనసీమ సంక్రాంతి సంబరాలను మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించిన మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులను మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పినిపే విశ్వరూప్ ఘనంగా సత్కరించి అభినందించారు.

కళకళలాడిన పల్లె లోగిళ్లు

- అంబరాన్ని తాకిన సంక్రాంతి సంబరాలు
- కోనసీమ ముగ్గుల పోటీలకు అపూర్వ స్పందన
- అలరించిన ప్రభల తీర్థం



ముగ్గుల పోటీలో విజేతకు ఫ్రిజ్ బహూకరిస్తున్న ఆర్డీవో మాధవి, డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు



బాణా సంచా కాల్పులను వీక్షిస్తున్న మంత్రి సుభాష్, ఎంపీలు హరీష్ మాథూర్, సతీష్ తదితరులు

అమలాపురం టౌన్: సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పిల్లా పాపలతో తెలుగు లోగిళ్లు కళకళలాడాయి. సంక్రాంతి, కనుమ పండగలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. గ్రామాల్లో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదాన్నిచ్చే పోటీల్లో స్థానిక మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎన్‌వీఆర్ నగర్‌లో జరుగుతున్న కోనసీమ సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. హైదరాబాద్, విశాఖ మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంతో జరుగుతున్న ఈ సంబరాల్లో మకర సంక్రాంతి పర్వదినాన కోనసీమ స్థాయి ముగ్గుల పోటీలు ముచ్చటగా జరిగాయి. ఈ పోటీలకు దాదాపు 450 మంది వరకూ మహిళలు పాల్గొని ముత్యాల ముగ్గులను తీర్చిదిద్దారు. పోటీలకు ఆర్డీవో కె.మాధవి ముఖ్య అతిథిగా పాల్గొన్ని ముగ్గులను ఆద్యంతం తిలకించారు. సాయంత్రం విజేతలకు ఆర్డీవో మాధవి, డాక్టర్ వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు. ఓ పక్క రంగ వల్లుల పోటీలు జరుగుతుండగా గరగ నృత్యాల ప్రదర్శన మరో పక్క ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కనుమ పండుగ పర్వదినాన ప్రభల తీర్థం అత్యంత వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 12 ప్రభలు ఒకే చోట కొలువు దీరాయి. రాత్రి భారీ ఎత్తున బాణా సంచా కాల్చారు. రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ సభ్యుడు శానా సతీష్ తదితరులు వీక్షించారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మెట్ల రమణబాబు, జిల్లా అల్డా మాజీ చైర్మన్ యాళ్ల దొరబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, జిల్లా క్రీడా భారతి అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: సంక్రాంతి సంబరాల్లో చివరి రోజైన బుధవారం ఐ.పోలవరం పంచాయతీ పెదమడిలో ప్రభల తీర్థం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. సంస్కృతీ సంప్రదాయల మేళవింపుతో గ్రామంలోని దేవతా మూర్తులను ప్రభలపై ఊరేగించి భక్తి భావం చాటుకున్నారు. కనుమ పండగను పురస్కరించుకొని ఐ.పోలవరం శివారు పెదమడి మెక్క తోటలో ప్రభల తీర్థం ఘనంగా జరిగింది. మండలం నలు మూలల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి ఈ తీర్థానికి పెద్ద ఎత్తున జనం వచ్చారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఏడుకొండలు తదితరులు

గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన వారు తాటి శూలం, టేకు చెక్క, వెదురు బొంగులతో వీటిని తయారు చేశారు. వీటికి నెమలి పించాలు, రంగు రంగుల నూలు వస్త్రాలు అలంకరించారు. దేవాలయాల్లో ఉండే పసిడి కుండలు, వరి కంకెలను వీటికి వేలాడ దీశారు. కనుమ పండగతో మూడు రోజుల సంక్రాంతి సంబరాలు పరిసమాప్తం కానుంది.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

తాళ్లరేవు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవులో రైజింగ్ స్టార్ స్పోర్ట్స్ క్లబ్, భీమ్‌సేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి పండగ రోజున ముగ్గుల పోటీలు, సంక్రాంతి రోజున కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. సుంకరపాలెం పంచాయతీ బాబానగర్‌లో సిద్ధార్థ స్టూడెంట్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, స్లో సైక్లింగ్, వాలీబాల్, మ్యూజికల్ చైర్స్, అంబేడ్కర్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, కాశి రామారావు, కాశి లక్ష్మణస్వామి, నాగాబత్తుల మురళి తదితరులు బహుమతి ప్రదానం చేశారు.



మురమళ్లలో కోడి పందేల బరుల వద్ద చూపరుల వాహన శ్రేణి



మురమళ్లలో కోడి పందేల ప్రదేశంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు



అమలాపురంలో గుండాట బోర్డుల బోర్డుల వద్ద జనం

కోడి పందేలు.. జూద క్రీడలు

- చేతులు మారిన కోట్లాది రూపాయలు
- బరులకు తరలి వచ్చిన జనం
- స్థానిక ప్రజా ప్రతినిధుల సమక్షంలోనే నిర్వహణ

ఐ.పోలవరం: సంక్రాంతి పండగను పురస్కరించుకొని జిల్లాలో ఎక్కడాలేని విధంగా మురమళ్లలో మూడు రోజుల పాటు నిర్వహించిన కోడి పందేలలో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, గుండాట వంటి జూదాలు మూడు రోజులు జోరుగా సాగాయి. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని పోలీసులు ముందస్తు హెచ్చరికలు చేసినప్పటికీ రాజకీయ నాయకులు, పందెం రాయుళ్లదే పైచేయి అయ్యింది. పోలీసులు మాత్రం అరికట్టే విషయంలో పూర్తిగా విఫలమయ్యారు. ఈ మూడు రోజులలో సుమారు రూ.60 కోట్లకు పైగా చేతులు మారినట్లు అంచనా. జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా మురమళ్లలో భారీ ఏర్పాట్లు చేశారు. మినీ స్టేడియంను తలపించే విధంగా భారీ షామియానాలు, వీఐపీ గ్యాలరీలు, 6వేల మంది కూర్చుని చూసే విధంగా కుర్చీలు, మిగిలిన వారు నిలబడి చూసే విధంగా ఏర్పాటు చేశారు. కేశనకుర్రుపాలెం, కొమరగిరి, జి.వేమవరం, ఐ.పోలవరం మొక్క తోటలో కోడి పందేలు నిర్వహించారు. పలు నగరాలు, ఇతర జిల్లాలలో నివాసం ఉంటున్న ఉద్యోగులు, వ్యాపారస్తులు ప్రత్యేక వాహనాల్లో వచ్చి పందేలు కాశారు. మురమళ్లలో భారీగా సైకిళ్లు, మోటారు సైకిళ్లు, కార్లపై ఈ పందేలు తిలకించేందుకు, పందాలు కాసేందుకు తరలివచ్చారు. మురమళ్లలో జరిగిన పందాలను స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు వీక్షించారు. ఈయనతో పాటు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, ఎంపీలు గంటి హరీష్ బాలయోగి, తంగెల ఉదయ్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, సినీ నటి హేమతో పాటు పలువురు నాయకులు పందేలను వీక్షించారు.



ఆకులవారిపాలెంలో పందెం బరి వద్ద అధికార పార్టీ నేతల ఫ్లెక్సీలు

అమలాపురం రూరల్: సంక్రాంతి పండగ మూడు రోజులు బరి తెగించి మరీ కోడి పందేలు జోరుగా నిర్వహించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కోడి పందేలు అడ్డూ అదుపు లేకుండా బహిరంగంగానే నిర్వహించడం గమనార్హం. కోడి పుంజులు కత్తులతో బరిలోకి కాలు దువ్వి రక్తం చిందిచడం కనిపించింది. లక్షలాది రూపాయలు చేతులు మారాయి. మంగళ, బుధవారాలు రెండు రోజులు వేలాది సంఖ్యలో కోళ్లు తలపడ్డాయి. అమలాపురం మండలంలోని ఇందుపల్లి, కామనగరువు, గున్నేపల్లి అగ్రహారం, సవర్నాపాలెం, బండారులంక, పేరూరు, రోళ్లపాలెం గ్రామాల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. కామనగరువులోని బైపాస్ రోడ్డులో మూడు ప్రాంతాల్లో కోడి పందేలను చూసేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. దీంతో పందేలు నిర్వహించే ప్రాంతాలకు వెళ్లే దారులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. గుండాట బరులలో అశ్లీల నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కామనగరువు, పేరూరు ప్రాంతాలలో అశ్లీల నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

అల్లవరం: అల్లవరం, కోడూరుపాడు, రెల్లుగడ్డ గ్రామాల్లోని ప్రధాన బరుల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. మూడు రోజుల పాటు జరిగిన పందెం బరుల్లో లక్షల్లో డబ్బులు చేతులు మారాయి. తూర్పులంక, దేవగుప్తం, ఆకులవారిపాలెం, గుత్తులవారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన పందెం బరుల్లో ఆశించిన స్థాయిలో పోటీలు జరగలేదు. పందెం బరిలో ఎక్కడా చూసిన పార్టీ నేతల ఫ్లెక్సీలే దర్శనమిచ్చాయి. దేశికోడు వంతెన వద్ద పందెం బరిలో ఏర్పాటు చేసిన గుండాటలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అదృష్టాన్ని పరీక్షించుకున్నారు.

నేడు వనువులమ్మ తీర్థం



శెట్టిపల్లిలో వనువులమ్మ

అమలాపురం రూరల్: తాండవపల్లి పరిధిలోని శెట్టిపల్లి గ్రామ దేవత వనువులమ్మ తీర్థ మహోత్సవాలు గురువారం వైభవంగా జరగనున్నాయి. బుధవారం అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. అమ్మవారి తీర్థ మహోత్సవానికి గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు.15 రోజులుగా అమ్మవారికి సేవలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి గ్రామంలో వంతుల వారీగా అన్ని సామాజిక వర్గీయులు అమ్మవారికి సేవలు నిర్వహిస్తున్నారు. మహోత్సవానికి చిందాడగరువు, రోళ్లపాలెం, వన్నె చింతలపూడి, కామనగరువు, రంగాపురం, సమనస, అమలాపురం తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్నారు.

పోలీసుల బైక్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ రాజశేఖరన్, ట్రాఫిక్ ఎస్సై నూకరాజు

యానాం: రహదారి భద్రతా మాసోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక పోలీసులు హెల్మెట్‌లు ధరించి బైక్ ర్యాలీని నిర్వహించారు. స్థానిక ఆర్‌ఏఓ ఆఫీసు వద్ద ఎస్పీ రాజశేఖరన్ బైక్ ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలన్నారు. బైక్ ర్యాలీ పట్టణ పురవీధుల్లో సాగింది. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అలుకల సంబరం



ఊరేగుతున్న బుగ్గలకు శూలాలు గుచ్చుకున్న యువకులు

అమలాపురం రూరల్: మండలంలోని వన్నె చింతలపూడి గ్రామంలోని వీరభద్ర స్వామి ఆలయంలో అలుకల సంబరాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బుగ్గలకు శూలాలు గుచ్చుకున్న యువకులను గ్రామంలో ట్రాక్టర్‌పై ఊరేగించారు. శక్తి వేషాలు, తీన్‌మార్ డప్పులతో గ్రామంలో ఉరేగింపు నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభవించిన భక్తి భావం

- ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రభల తీర్థాలు
- మిన్నంటిన అశ్శరభ శరభ, అల్లల్ల వీర శరణుఘోష
- ప్రాచీన సంస్కృతికి అద్దం పట్టిన ప్రభలు

ముమ్మిడివరం: నియోజకవర్గంలో కనుమ పర్వదినం సందర్భంగా బుధవారం ప్రభల తీర్థాలు ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగాయి. ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాల మేళవింపుతో ఆయా గ్రామాల్లో దేవతా మూర్తులను ప్రభలపై ఊరేగించి భక్తి భావం చాటుకున్నారు. నియోజకవర్గంలో ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం, ఐ.పోలవరం మండలం మొక్కతోట, కాట్రేనికోన మండలం చెయ్యేరు, తాళ్లరేవు గ్రామాలలో జరిగిన ఉత్సవాల్లో అశ్శరభ, శరభ, అల్లలవీర శరణు ఘోష మిన్నంటింది. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో తీర్థ ప్రదేశాలు కళకళలాడాయి. పచ్చని పొలాల్లో రంగు రంగుల దుస్తులు, పువ్వులతో అలంకరించి ఊరేగించిన ప్రభలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. యువకుల నృత్యాలు, సన్నాయి మేళాలు, గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి.

నియోజక వర్గంలో అతి పెద్ద ప్రభల తీర్థమైన పల్లిపాలెం ప్రభల తీర్థం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొమానపల్లి, కొత్తలంక, ముమ్మిడివరం గ్రామాల తల్లి ప్రభలను ఆయా గ్రామాల నుంచి సన్నాయి మేళాలు, బాణా సంచా కాల్పులతో ఊరేగింపుగా తీసుకుచ్చారు. యువకులు కేరింతల నడుమ పల్లి పాలెం తీర్థం ఆవరణకు తెచ్చారు. ముమ్మిడివరం అగ్రహారం, చింతల మెరక, వడ్డిగూడెం, పదవ మైలు రాయి, రాజుపాలెం, గ్రామాల ఉత్సవ ప్రభలను పచ్చని పంట పొలాలు, పంట కాలువలు దాటుకుని తీర్థ ప్రదేశానికి తీసుకు వచ్చారు. ఆయా గ్రామాల శివ స్వరూపమైన ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రభలను పూల దండలతో అలంకరించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పెన్మత్స జగ్గప్ప రాజు, పెన్మత్స చిట్టిరాజు, పలువురు ప్రముఖులకు ఆహ్వానం పలికారు. అన్నంపల్లి, క్రాపచింతల పూడి, అయినాపురం గ్రామాలతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రభల తీర్థా న్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

అమలాపురం రూరల్: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఏటా కనుమ రోజున జరిగే ప్రభల ఉత్సవాలు అమలాపురం పరిసర గ్రామాల్లో అంబరాన్ని తాకాయి. ఆలయాల్లో ఉత్సవ మూర్తులను రంగు రంగుల దుస్తులతో అలంకరించిన ప్రభలపై ఉంచి భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. వివిధ గ్రామాల ప్రభల ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన బ్యాండ్ మేళాలు, గరగ నృత్యాలు, బుట్ట బొమ్మలు, కోయ డ్యాన్సులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు భారీగా తరలి రావడంతో గ్రామాలు కోలాహలంగా మారాయి. సాకుర్రు వినాయక, దత్తేశ్వర స్వామి ఆలయాల వద్ద జరిగిన ప్రభల తీర్థానికి ఇందుపల్లి, ఇందుపల్లి గరువు, సాకుర్రు గ్రామాల నుంచి నాలుగు పెద్ద ప్రభలు, కొన్ని చిన్న ప్రభలు ఊరేగింపుగా తరలి వచ్చాయి. ఆలయం వద్ద మధ్యాహ్నం తీర్థ మహోత్సవం జరిగింది. వందేళ్ల చరిత్ర ఉన్న ఈ తీర్థానికి పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఇందుపల్లిలోని ఉమా రామలింగేశ్వర స్వామి, సాకుర్రులోని తపేశ్వర స్వామి వారి ఆలయాల నుంచి ప్రధాన ప్రభలను ఊరేగించారు. ఈదరపల్లి, ఇందుపల్లి, పేరూరు, భట్లపాలెం, బండార్లంక, గున్నేపల్లి అగ్రహారాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఈ తీర్థ మహోత్సవాలకు తరలి వచ్చారు. భట్నవిల్లి, ఏ.వేమవరం గ్రామాల్లోని ఆలయాల నుంచి ప్రభలను మంగళ వాయిధ్యాలు, మేళతాళాల నడుమ భారీ బాణాసంచా కాల్పులతో ఊరేగింపుగా ముక్తేశ్వరంలోని క్షణ ముక్తేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగే ప్రభల తీర్థానికి తీసుకువచ్చారు.

బండార్లంకలో కనుమ పండగ రోజు నిర్వహించే గోతులో తీర్థం బుధవారం వైభవంగా జరిగింది. వీరభద్రస్వామి గుడి వద్ద ప్రభ, బ్రాహ్మణ శివాలయం ప్రభ, బాల గణపతి యువజన సంఘం ప్రభలు మూడా తీర్థంలో కొలువు తీరాయి. వందలాది మంది భక్తులు ప్రభలను దర్శించుకుని తరించారు.

వైభవంగా గణికమ్మ ప్రభల తీర్థం

అమలాపురం టౌన్: స్థానిక వంటెద్దువారి వీధిలో వేంచేసి యున్న గణికమ్మ ఆలయం వద్ద ప్రభల తీర్థం మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకూ వైభవంగా జరిగింది. ఆలయం వద్దకు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అయిదు ప్రభలు కొలువు దీరాయి. భక్తులు ఆలయంలో అమ్మవారికి పూజలు చేసి వెలుపల ఉన్న ప్రభలను దర్శించుకున్నారు. శ్రీగనికమ్మ వారి సేవా సమితి భక్తులకు సేవలందించింది.



పల్లిపాలెంలో ఆక్వా చెరువును దాటుకుంటూ ప్రభలను ఊరేగింపుగా తీసుకు వస్తున్న భక్తులు



పల్లిపాలెంలో ఊరేగింపుగా తీర్థ స్థలికి చేరుకుంటున్న ప్రభలు



సాకుర్రులో ఊరేగుతున్న ప్రభలు



అమలాపురంలో గణికమ్మ ఆలయం వద్ద ప్రభల తీర్థం